


# అగ్నిపర్వతం

ముసునూరి పేరయ్య శాస్త్రి

'మీకు నలభై ఏళ్ళంటే ఎవరూ నమ్మరు. పాతికేళ్ళ వడు చమ్మాయిలా ఉంటా'రని ఎవరైనా అంటే రమ పొంగిపోతుంది. . అన్న వాళ్ళు లేకపోయినా, తన బెడ్ రూములోకి వచ్చి నిలువుటద్దంలో తన అందాన్ని చూసుకుని మురిసిపోతుంది.

నిజమే! శరీర పోషణ అలాంటిది. అలంకరణపైన శ్రద్ధ అటువంటిది. ఎంత ఖరీదైన కాస్మొటిక్స్ అయినా అడిగన వెంటనే తీసుకు వచ్చే భర్త ఉండగా ఆమెకు లో టేమిటి?

"ఓ ... ఏమిటోయ్ రోజు రోజుకు కుర్రదానివైపోతున్నావ్?" అంటాడు భర్త మధు.

ఆమె అందంలోనే కాదు నడకలో, మాటల్లో, చూసే చూపుల్లో కూడా నవ్యత్వం తొంగి చూస్తుంటుంది.

"అమ్మా! మొన్న మ నిద్దరం బజారు కెళ్ళాం గదా! రోడ్డు మీద మనను మా ఫ్రెండ్ చూశాట్ట. మర్నాడు న న్నడిగాడు - 'ఆమె మీ అక్కగారా' అని. కాదు మా అమ్మ అని చెబితే ఆశ్చర్యపోయాడు." అన్న పది సంవత్సరాల కొడుకు గోపీ మాటలు విని నవ్విన రమకి - కూతురు పద్మ వరస ఏ మాత్రమూ నచ్చదు.

అందరూ తన అందాన్ని పొగుడుతారు, తనతో సినిమాలకూ, షాపింగ్‌లకూ, షికారులకూ రావడానికి ఇష్టపడతారు. తనతో స్నేహం చేయడానికి తహతహ లాడతారు. కాని కూతురు పద్మ తనతో అంటీ అంటనట్టుటుంది. సినిమాకు రమ్మంటే చదువుకోవాల నంటుంది.

"అది కాదు పద్మా! అందరం కలసి వెడదాం." అని తండ్రి అంటే "సారీ నాన్నా! నా కిష్టం లేదు" అంటుంది.

రమ అరుస్తుంది. బీ.పీ. పెంచుకుంటుంది. అందరినీ తిట్టిపోస్తుంది గానీ పద్మ మాత్రం వెళ్ళడానికి అంగీకరించదు.

'దాని పద్ధతే అంత' సరిపెట్టుకుంటాడు తండ్రి.

'అదో పుస్తకాల పురుగు' అంటాడు గోపి.

ఎవ రేమన్నా నా కేమన్నట్టుగా తన పని తాను చేసుకుపోతుంది పద్మ.

ఆ రోజు ఆ ఇంట్లో అందరూ సంబరంగా ఉన్నారు. తల్లి దండ్రుల రాక కోసం ఎదురు చూస్తున్నాడు గోపి. మహిళామండలి ప్రెసిడెంట్‌గా ఎన్నికైన తల్లిని అభినందించడానికి 'బొకే'తో సిద్ధంగా ఉన్నాడు పద్మ ఒక మూల పుస్తకం చదువుకుంటూ కూర్చుంది.

పదకొండు గంటల ప్రాంతంలో బయట స్కూటర్ ఆగిన చప్పుడుకు గోపీ పరుగెత్తు కెళ్ళాడు.

"అమ్మా! కంగ్రాట్స్!" అని 'బొకే' తల్లి కిచ్చాడు.

రమ బొకే అందుకుని కొడుకుని ముద్దు

పెట్టుకుని కూతురు కోసం చూసింది. పద్మ వచ్చి, ముఖాన నవ్వు పులుముకుని "కంగ్రాట్స్" అంది.

ఆ మాటకే పొంగిపోయిన రమ మెరిసే కళ్ళతో భర్త వైపు చూసింది. తర్వాత "డియర్ చిల్డ్రన్! ఈ రోజు స్పెషల్ లంచ్ ఇన్ అశోకా హోటల్! లెట్స్ స్టార్ట్" అంది.

గోపీ ఎగిరి గంతేశాడు.

"అటు నుంచే మంచి పిక్చర్‌కి" అంది రమ మళ్ళీ.

గోపీ ఎగిరి తల్లిని ముద్దు పెట్టుకున్నాడు. పద్మ అక్కడి నుంచి జారుకోబోయింది.

"పద్మా! నువ్వు రెడియేనా?" అడిగింది.

"సారీ మమ్మీ!"

రమ ముఖం ఎర్రబడింది - "ఏమిటే? ప క్కింటి విశాలాక్షి, ఎదు రింటి కల్యాణ, బయటి వాళ్ళు ఎవ రొచ్చి అడిగినా సై అంటూ వెడతావే! ప్రేమగా తల్లి అడిగితే కాదంటావా? అంత చేదైపోయానా నేను."

పద్మ తల వంచుకుని నిలబడింది. పరిస్థితి విషమించబోతున్న దని గ్రహించి భార్యను సముదాయించబోయాడు గానీ రమ అతన్ని తీసేసినట్లుగా -

"మీ రుండండి! దీనికి పొగ రెక్కిపోతోంది. ఎందుకట ఆ పొగరు? డిగ్రీలో చేరిం దనా?" అంటూ సాధించసాగింది.

మాటల ఈటెలతో దెప్పింది. 'నూతిలో కప్ప'వంది. 'చదు వున్నా సంస్కారం లే' దంది. 'మూల నున్న ముసలమ్మ' వంది. ఆయాసం వచ్చే వరకూ ఇన్నాళ్ళూ తన కడుపులోని కుళ్ళునంత వెళ్ళగక్కింది.

ఆ తర్వాత పద్మ తాపీగా అడిగింది "సాధించడం అయిందా?" అని.

"ఆ పొగరే తగ్గించుకో మంటున్నాను!" విసురుగా అంది రమ.

## చర్చిల్ ఘనత

పెద్దవారు తింటే ప్రసాదం అంటారు. చిన్నవారు తింటే చిరుతిండి అని కోప్పడతారు. పెద్దల కిచ్చింది బహుమానం అవుతుంది. చిన్నల కిచ్చింది లంచం అవుతుంది. పెద్దవారు చేసింది లీల అవుతుంది. చిన్నవారు చేసింది చిలిపితనం అవుతుంది. ఏతావతా తేలేదేమిటంటే పెద్దవారు ఏమి చేసినా ఘనంగానే ఉంటుంది. వెనుకటికి ఒక కవిగారు తాను శతాధిక గ్రంథకర్తనని చెప్పుకొనేవాడట. అయితే ఆయన రచనలు పాఠకులకి అంతగా కొరుకుడు పడేవి కావు. అందువల్ల వెటకారంగా 'శకటాధిక గ్రంథకర్త' [బండెడు కంటే ఎక్కువ] అని అంటుండేవారట. పుస్తకాలలోని విలువను తెలిపేది వాటిలోని సారం కాని, వాటి బరువు కాదు. అయితే కొందరు పాఠకులు తమ అభిమాన రచయితలు రాసిన గ్రంథ రాజాలలోని పదాల్ని లెక్కించి మురిసిపోతుంటారు. ఇటువంటి హిరి గణాంక వివరాల ప్రకారం షేక్స్పియర్ మహాకవి తన నాటకాలలో ముప్పై వేల పదాలను వాడాడట. బ్రిటిష్ మాజీ ప్రధాని సర్ విన్‌స్టన్ చర్చిల్ తన రచనలలో 60 వేల పదాలకు పైబడి ఉపయోగించాడట. ఈ లెక్కన ఉద్గ్రంథాలైన రామాయణ, మహాభారతాలలోనూ, వేదాలలోనూ ఎన్ని లక్షల పదాలున్నాయో ఎవరైనా లెక్కించి చెప్తే బాగుంటుంది.

-కె. ఆర్. కె. మోహన్

"ఇది పొగరు కా దమ్మా! నిజం. నీతో సినిమాలకీ, షికారులకీ రావడం నా కే మాత్రం ఇష్ట ముండదు. నీవు అందగత్తెవే! కా దనను. అయితే సహజమైన అందాన్ని పోగొట్టుకుంటూ నీవు చేసుకునే ఆ ఎబ్బెట్టైన అలంకరణ నాకు నచ్చదు. ఏ జనమైతే నీ ముందు నీ అందాన్నీ నీ అలంకరణనీ మెచ్చుకుంటున్నారో ఆ జనమే నీ వెనుక నీ మీద జోకు లేసుకుంటున్నా రని నీకు తెలియదు. పైగా సినిమా హాళ్ళ దగ్గర మగవాళ్ళు నిన్నే పరిశీలనగా చూడటం, జోకు లేసుకోవడం చూసినా, విన్నా నాకు కంపరంగా ఉంటుంది. పైగా అ దేదో అభ్యుదయ మన్నట్లుగా అందర్నీ ఆకర్షించే విధంగా నీ నడక, నీ మాటలు, నీ హావభావాలు. నీ పక్కన కూతురిగా నే నుండలేను. నీ పక్కన ఒక దిష్టిబొమ్మలా నిలబడే శక్తి నాకు లేదు." అన్న కూతురి మాటలు విన్న రమ నిశ్చేష్టురాలైపోయింది.

పద్మ తన గదిలోకి వెళ్ళిపోయింది. గోపీ చప్పుడు కాకుండా జారుకున్నాడు.

కొన్ని క్షణాల తర్వాత రమ అక్కడే ఉన్న కుర్చీలో కూలబడి తలవంచుకుంది. మధు ఆమె పక్కన కూర్చుని ఓదార్పుగా తల నిమిరాడు. ఆమె తలెత్తి నిశ్చలంగా నవ్వి - "దాని హృదయంలో అగ్నిపర్వతం. అది బద్దలైంది" అంది.

అత నేమీ మాట్లాడలేదు.

"ఇన్నాళ్ళు నా అందాన్ని అందరూ పొగుడుతున్నా రని పొంగిపోయానే గానీ, ఎదిగిన కూతురున్న సంగతే పట్టించుకోలేదు. అమ్మాయి చెప్పింది నిజం. ప్రతి ఆడపిల్ల తన తల్లి గురించి గర్వంగా చెప్పుకోవాలి. నా కూతురు తన తల్లి గుర్చించి గర్వంగా చెప్పుకోవా లంటే, తల్లి పక్కన ధైర్యంగా నిలబడా లంటే ..." అని లేచి తన గదిలోకి వెళ్ళింది. లిప్‌స్టిక్ చెరుపుకుంది. పెద్ద మనిషి తరహాగా నిరాడంబరంగా ముస్తాబై కూతురున్న గదిలోకి వెళ్ళి "అమ్మా పద్మా!" అని పిలిచింది.

పద్మ తల్లిని చూసింది. లిప్‌స్టిక్ లేదు, హేర్ స్టైల్ లేదు. బ్యూటీ స్పాట్ లేదు. సింపుల్‌గా ద్విగుణీకృతమైన అందంతో - నిజమైన తల్లిలా ఉన్న తల్లిని పరుగున చేరుకుని, అక్కున తల చేర్చి గొల్లు మంది.

రమ కూతుర్ని గుండెలకు గట్టిగా హత్తుకుని తల నిమురుతూ ఉండిపోయింది. ✱




